KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 | సంచిక 200 | ఆదివారం 22 జూన్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-



## స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ



- టెక్ దిగ్గజాల మక్కువతో హైదరాబాద్ ఐటీ రంగంలో బెంగళూరును దాటింది
- వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం
- 15 రోజుల్లో పరిశ్రమలకు అనుమతులు.. పారదర్శక పాలనకు తెలంగాణ నిదర్శనం
- కేసీఆర్ ఎఫెక్ట్‌తో అభివృద్ధిలో అగ్రస్థానంలో తెలంగాణ: ఆక్స్‌ఫర్డ్ ఫోరంలో కేటీఆర్

2 లో

స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో తెలియడానికి తెలంగాణనే నిదర్శనం అని అన్నారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో తెలంగాణ విజయగాథను కేటీఆర్ వినిపించారు.

## కేబీఆర్ పార్కుకు జయశంకర్ సార్ పేరు పెట్టాలె

సర్కారు స్పందించకుంటే ఆ పని మేమే చేస్తం పార్కు ముందు విగ్రహం కూడా పెట్టాలె ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్



2 లో

## ప్రణీత్‌రావును మరోసారి విచారించిన సిట్



ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు మరోసారి విచారించారు. 5 గంటల పాటు ప్రణీత్ రావును సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఉదయం 11గంటలకు హాజరయిన ప్రణీత్ రావు...విచారణ ముగిసిన తర్వాత సాయంత్రం 4గంటలకు తిరిగి వెళ్లిపోయారు. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు, అప్పటి పోలీసు ఉన్నతాధికారుల ప్రమేయం ఈ వ్యవహారంలో ఏ మేరకు ఉందనే కోణాల్లో విచారణ కొనసాగినట్లు సమాచారం.

## రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందని దుష్ప్రచారం..

- కొందరు కావాలనే పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారు
- రాష్ట్రంలో నిర్మాణ రంగం 11.97% వృద్ధి, రూ.80 వేల కోట్లు ఆదాయం
- హైదరాబాద్‌లో రూ 1 కోటి పైగా ఇళ్ల కొనుగోళ్లు 58% పెరిగాయి
- రెరా వద్ద 9,744 ప్రాజెక్టులు రిజిస్టర్:
- ప్రభుత్వంపై అపోహలు వద్దని హెచ్చరిక
- నిర్మాణ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది: - టైమ్స్ హెూమ్ ఎక్స్‌పోలో మంత్రి హామీ



2 లో



## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి భారీ ఊరట

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట దక్కింది. క్వారీ యజమానిని బెదిరించారనే కేసులో కోర్టు కీలక తీర్పును వెలువరించింది. కౌశిక్‌రెడ్డి రిమాండ్‌ను ఖాజీపేట రైల్వేకోర్టు తిరస్కరించడంతో పాటు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. క్వారీ యజమానిని బెదిరించారన్న కేసులో పోలీసులు శనివారం ఉదయం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సుబేదారి పోలీసులు ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకొని వరంగల్‌కు తరలించారు.

2 లో

## ఇది బేడీల రాజ్యం

### - హరీష్ రావు



2 లో

- రైతుల చేతులకు బేడీలు వేసిన ఘనత రేవంత్‌కే దక్కింది
- రైతుబంధును ఓట్ల సమయంలో మాత్రమే ఇస్తున్న రేవంత్ ప్రభుత్వం
- రైతు సంక్షేమం కేసీఆర్ పాలనలోనే నిశ్చితంగా సాగింది
- రైతు సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు
- పటాన్ చెరులో రైతుబంధు రాకపోతే కలెక్టరేట్, ఓఆర్ఆర్ దిగ్బంధనానికి బీఆర్ఎస్ హెచ్చరిక

జిన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుబంధు నిధుల కోసం రైతుల ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్చెరువు నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి రెండు లక్షల ఎకరాలకు రైతుబంధును ప్రభుత్వం ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదన్నారు. పటాన్చెరువు రైతులు చేసిన పాపం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏతులకు పోయి పదికి పదిహేను ఇస్తాను అని కోతలు కోసిన ఏతుల రాయుడు నేడు రైతుబంధును ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నాడని దుయ్యబట్టారు.

ఆనాడు కెసిఆర్ హయాంలో రైతులకు వరినాట్ల సమయంలో రైతుబంధును ఇస్తే నేడు ఓట్ల సమయంలో ఇచ్చే విధంగా రేవంత్ పాలన సాగుతుందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ఎమ్మెల్యేల జీతాలను బందు చేసి రైతులకు సహాయం అందించిన ఘనత కేసీఆర్ దని గుర్తు చేశారు. నాడు రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామన్న కోతల ప్రభుత్వం ఇంతవరకు దాని ఊసే లేదని గుర్తు చేశారు. రైతు చనిపోతే పది రోజుల్లో వారి కుటుంబానికి రైతు భీమా ద్వారా పది లక్షల రూపాయలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేవుళ్ళపై ఒట్టు పెట్టి మాట తప్పిన ఘనత ఎగవేతల రాయుడు రేవంత్ దే అన్నారు.




## ప్రపంచ శాంతికి యోగ దిక్సూచి

- విశాఖ ఆర్కే బీచ్‌లో అద్భుతంగా యోగాంధ్ర
- ప్రపంచానికి 'మానవాళి కోసం యోగా 2.0' పిలుపు
- 175 దేశాలకు యోగ సందేశం - మానవత్వానికి మార్గం యోగా
- చంద్రబాబు, పవన్, లోకేష్‌లకు మోదీ అభినందనలు
- నూనె పదార్థాలు తగ్గించండి -ఆరోగ్యానికి యోగ అవశ్యకం : మోదీ సూచన


2 లో

ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలో ఆర్కే బీచ్ వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి చంద్ర బాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , పలువురు మంత్రులతో పాటు లక్షలాదిమంది కూడా హాజరై యోగాసనాలు వేశారు

ఈ సందర్భంగా ప్రధాన మోడీ మాట్లాడుతూ ఈ యోగా దినోత్సవం 'మానవాళి కోసం యోగా 2.0' కు నాంది పలకాలని, దీని ద్వారా అంతర్గత శాంతి ప్రపంచ విధానంగా మారాలని అంతర్జాతీయ సమాజానికి ఆయన పిలుపునిచ్చారు. .యోగ అనేది ప్రపంచాన్ని కలుపుతుంది.. 175 దేశాలలో యోగా చేయడం సాధారణ విషయం కాదు అంటూ తెలిపారు. ఇదంతా కూడా మనతోనే సాధ్యమైందని వెల్లడించారు.

## నేటి మాట

డబ్బుతో కొనే వస్తువులను కొనడం మంచిదే కానీ, డబ్బుతో కొనలేని వస్తువులను పోగొట్టుకోవడం మాత్రం మంచిది కాదు



- విలియం షేక్స్పియర్

## పదేండ్లుగా భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన

- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం: భూ భారతికి ప్రజల నుండి 8.58 లక్షల దరఖాస్తులు
- రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై స్పష్టత.. రైతులకు న్యాయం
- రైతుల వద్దకే వెళ్లిన రెవెన్యూ అధికారులు.. ఉచితంగా దరఖాస్తుల స్వీకరణ: మంత్రి పొంగులేటి



2 లో

## కేసీఆర్, కేటీఆర్‌కు ఇంకా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు

### హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా ఫోన్‌ట్యాపింగ్: బండి సంజయ్



ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెప్పింది తానేనన్నారు. "హైదరాబాద్, సిరిసిల్ల కేంద్రంగా ఫోన్‌ట్యాపింగ్ జరిగింది. ప్రభాకర్‌రావు చాలా మంది జీవితాలను నాశనం చేశారు. భారాస నేతలు, వారి భార్యల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలి. పెద్దాయన చెబితే ఫోన్ ట్యాపింగ్ చేశామని ఇప్పటికే రాధాకిషన్ చెప్పారు.

2 లో



## విద్యుత్ రంగంలో దేశానికే తెలంగాణ దిక్సూచీ

2 లో

- విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు 1.944% డీఏ పెంపు
- డీఏ పెంపుతో విద్యుత్ సంస్థపై నెలకు రూ.11.19 కోట్లు భారం
- రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకు పెరుగుతోంది
- గ్రీన్ ఎనర్జీ పాలసీ- 2025 లక్ష్యం: 2029 నాటికి 20,000 మెగావాట్ల గ్రీన్ పవర్
- విద్యుత్ ఉద్యోగుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం: డిప్యూటీ సీఎం స్పష్టం

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



## ప్రపంచ శాంతికి యోగ దిక్సూచి - ప్రధాని మోడీ

మొదటి పేజీ తరువాయి

నేవీకి చెందిన నౌకలలో కూడా యోగాసనాలు వేస్తూ ఉన్నారు. యోగాంధ్రను నిర్వహించిన చంద్రబాబు, పవన్, లోకేష్ లకు అభినందనలు అంటూ తెలిపారు.అందరి క్షేమమే నా కర్తవ్యం అని భారతీయ సంస్కృతి నేర్పిందని ప్రపంచంలో ఏదో ఒక సమస్యను ఎప్పుడూ ఎదుర్కొంటూ ఉంటుంది.ఇలాంటి పరిస్థితులలోనే యోగ శాంతికి తోడ్పడుతుందని తెలిపారు మోదీ.యోగ మనలో మానవత్వాన్ని పెంచుతుంది. వ్యక్తిగత క్రమశిక్షణకు చాలా అద్భుతంగా ఉపయోగపడుతుంది అంటూ వెల్లడించారు.నేను అనే వాటి నుంచి మనం అనే భావనకు తీసుకువెళ్లే ఒక ఆయుధమే యోగ.ప్రపంచానికి పెద్ద సమస్యగా మారినటువంటిదే ఒబేసిటీ.. మనం తీసుకునే ఆహారంలో నూనె పదార్థాలు 10 శాతం తగ్గించాలి యోగాను ప్రతిరోజు ఉదయం తప్పకుండా ఒక ఉద్యమంలో చేస్తే అందరి ఆరోగ్యం కూడా బాగుంటుంది అంటూ వెల్లడించారు.

విశాఖపట్నం సాగర్ తీరంలో 11వ అంతర్జాతీయయోగా దినోత్సవం చాలా గ్రాండ్ గా జరిగింది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 28 కిలోమీటర్ల వరకు సుమారుగా ఐదు లక్షల మందితో యోగాసనాలు వేశారు.

# ఇది బేడీల రాజ్యం

మొదటి పేజీ తరువాయి


దేశానికి అన్నం పెట్టే రైతన్న చేతులకు బేడీలు వేసి రాష్ట్ర పరువును బజారులో వేసిన ఘనత రేవంత్ దేనని, ఫీజు రీయంబర్స్ మెంట్, కరెంటు కోతలు, తులం బంగారం, మహిళలకు రూ.2500, వృద్ధులకు 4000 పింఛన్, ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని కోతలే తప్ప చేసింది ఏమీ లేదన్నారు. హైడ్రా పేరుతో రాష్ట్రంలో అలజడి సృష్టించి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నేలకూల్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆనాడు ప్రతి గ్రామానికి వైకుంఠ దామాలు, పల్లె ప్రకృతి వనాలు, గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లను ఇచ్చిన ఘనత కెసిఆర్ దని గుర్తు చేశారు. నేడు ఇచ్చిన ట్రాక్టర్ కు డీజిల్ పోయలేని స్థితిలో గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయని, దీనికి కారణం రేవంత్ అసమర్థ పాలన అన్నారు.

పాలన చేతకాక ప్రతిపక్షాలపై తన అక్కసును తీర్చుకోవడం సరైన పద్ధతి కాదని గుర్తు చేశారు. ప్రతిపక్షాలపై తప్పులను ఎత్తిచూపడం తప్ప పాలన సోయి లేకుండా గాడి తప్పుతుందని ఆయన అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం రైతులకు రైతుబంధును ఇచ్చేవరకు పోరాటం చేస్తామని, ఇది ఆరంభం మాత్రమేనని ఆయన అన్నారు. లేనియెడల కలెక్టరేట్, ఓఆర్ఆర్ ను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. పోరాటం తమకేమీ కొత్త కాదని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తట్టుకునే దమ్ము ధైర్యం తమకు ఉందన్నారు. రేవంత్ పాలనలో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నిస్తున్న పాడి కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే చింత లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వెంకటేశం గౌడ్, కొలన్ బాల్ రెడ్డి, సోమిరెడ్డి, అంజయ్య యాదవ్, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, ప్రకాశం చారి, ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కేబీఆర్ పార్కుకు జయశంకర్ సార్ పేరు పెట్టాలె

కేబీఆర్ పార్కుకు ప్రొఫెసర్ జయశంకర్ పార్కుగా నామకరణం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. శనివారం కేబీఆర్ పార్కు వద్ద తీన్మార్ మల్లన్న, బీసీ నాయకులతో కలిసి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. కేబీఆర్ పార్కు పేరును కాంగ్రెస్ ప్రభుత్వం మార్చని పక్షంలో ఆ పని తామే చేస్తామన్నారు. వెంటనే కేబీఆర్ పార్క్ ముందు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాసు బ్రహ్మానంద రెడ్డి విగ్రహాన్ని జేసీబీలతో పెకిలించి అవతల పాడేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం పెడతామని స్పష్టం చేశారు. కేబీఆర్ పార్క్ ఒక్కటే కాదని, హైదరాబాదులో ఉన్న అన్ని పార్కులకు తెలంగాణ ఉద్యమకారుల పేర్లు పెట్టాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్స్, హెూటల్స్, ఏరియాల పేర్లు కూడా మార్చాలన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందని దుష్ప్రచారం.. శ్రీధర్ బాబు



రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందంటూ కొందరు కావాలనే పనిగట్టుకొని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. అలాంటి వారు ఒక్కసారి కళ్లు తెరిచి వాస్తవాలు తెలుసుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో "టైమ్స్ హెూమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్ పో 2025"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రియల్ ఎస్టేట్ అండ్ ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో 15.4 శాతం వృద్ధి రేటు నమోదు అయ్యిందని తెలిపారు. నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి చెందిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం రూ.80వేల కోట్లు సమకూర్చుతోందని, తెలంగాణ సర్వీసెస్ ఎకానమీలో ఈ రంగం వాటా 24.9 శాతం అని తెలిపారు.

ప్రస్తుతం రెరా దగ్గర 9744 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు రిజిస్టర్ అయ్యాయని, ఇవి గణాంకాలు కాదు.. మా హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి చెంప దెబ్బ అని వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్క హైదరాబాద్ లోనే 5,900 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.కోటి, అంత కంటే ఎక్కువ ధర గల ఇళ్ల వాటా 18 శాతంగా ఉందని తెలిపారు. ఈ తరహా ఇళ్ల కొనుగోలులో వార్షిక వృద్ధి రేటు 58 శాతంగా నమోదు అయ్యిందని నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని అన్నారు. తొలి దశలో 4.16 లక్షలు ఇచ్చామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న నిర్మాణ రంగం అని, దాని అభివృద్ధికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 'ఈ వేదిక ద్వారా బిల్డర్లు, కొనుగోలుదారులకు ఒక్కటి స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. ప్రభుత్వం మీ వెంట ఉంది. నిర్మాణ రంగ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా సిద్ధంగా ఉంది. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు. ధైర్యంగా అడుగు ముందుకు వేయండి"అని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, గంద్ర సత్యనారాయణ రావు, క్రెడాయ్ ప్రెసిడెంట్ జైదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి భారీ ఊరట

మొదటి పేజీ తరువాయి

మనోజ్‌రెడ్డి అనే వ్యాపారిని రూ.50లక్షలు ఇవ్వాలంటూ బెదిరించాడని అతని భార్య సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ 308(2), 308(4), 352 కింద కేసులు నమోదు చేశారు. ఈ ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు కౌశిక్‌రెడ్డి అరెస్టు చేశారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపరిచారు. 41ఏ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేశారని కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు రిమాండ్‌ను ఖాజీపేట రైల్వేకోర్టు న్యాయమూర్తి తిరస్కరించి.. బెయిల్‌ను మంజూరు చేశారు.

## స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటం తర్వాత 2014లో తెలంగాణ ఏర్పడింది. స్వతంత్ర భారతంలో అద్భుతమైన ఆర్థిక పురోగతి, ప్రగతిని చూపించిన రాష్ట్రం తెలంగాణ. అహింసాయుతంగా జరిగిన ఒక మహా అద్భుత పోరాటం తెలంగాణ ఉద్యమం. తెలంగాణ విజయాన్ని కేవలం అంకెలతో మాత్రమే చెప్పుకుంటే సరిపోదు. ఆత్మగౌరవం, పట్టుదలకు ప్రతిరూపంగా చెప్పుకోవడంతో పాటు లక్షలాది మంది భారతీయులకు భవిష్యత్తుపై భరోసాను ఇచ్చిన విజయగాథ లాగా తెలంగాణను చూడాలి. సబ్బండ వర్ణాల భాగస్వామ్యంతో సాధించిన సమ్మిళిత వృద్ధిలాగా తెలంగాణ విజయాన్ని చెటప్పుకోవచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు.

టెక్ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో..

ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉంది. 2015 నుంచి 2019 మధ్య కాలంలో కేవలం నాలుగు సంవత్సరాల స్వల్ప కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశాము. అమెరికా అవతల హైదరాబాద్‌లోనే అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ-హబ్ హైదరాబాద్‌లో ఉంది. ప్రపంచంలోని మూడో వంతు వ్యాక్సిన్ ఉత్పత్తి తెలంగాణలో జరుగుతుంది. ప్రపంచంలోనే ఐదు అతి పెద్ద టెక్ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోనే తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేశాయి. ఐటీ రంగ ఉద్యోగ కల్పనల్లో వరుసగా రెండు సంవత్సరాల పాటు బెంగళూరుని హైదరాబాద్ దాటింది అని కేటీఆర్ గుర్తు చేశారు.

శిథిలాల నుంచి గెలుపు సౌధాలను తెలంగాణ నిర్మించింది..

కొత్త రాష్ట్రంగా శిథిలాల నుంచి గెలుపు సౌధాలను తెలంగాణ నిర్మించింది. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో మేము తెలంగాణ రాష్ట్రంగా నూతన ప్రయాణాన్ని మొదలుపెట్టాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే అనుమతుల కోసం ఎన్ని రోజులు పడుతుందో ఎవరు చెప్పలేని పరిస్థితి ఉండేది. కానీ మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 రోజుల్లో అనుమతులు వచ్చేలా చేశాం. ఒకవేళ 15 రోజుల్లో లోపు అనుమతులు రాకపోతే ఆ పరిశ్రమను ప్రారంభించుకోవచ్చు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి అవకాశం లేదు అని కేటీఆర్ తెలిపారు.

వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం..

వ్యక్తుల కంటే విధానాలకే మేం ప్రాధాన్యత ఇచ్చాము. భారతదేశంలోని 65 శాతం ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. అందుకే మేము వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాము. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా దాదాపు రూ. 75 వేల కోట్లు జమచేసిన రాష్ట్రం దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేదు. మేం తీసుకొచ్చిన ఈ పథకం అద్భుత ఫలితాలను ఇచ్చింది. అందుకే 2014లో ధాన్యం ఉత్పత్తిలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ పంజాబ్, హర్యానా దాటి 2022 నాటికి నంబర్ వన్‌కు చేరింది అని కేటీఆర్ తెలిపారు.

తెలంగాణకు అద్భుతమైన భవిష్యత్ ఉంది..

బటర్ ఫ్లై ఎఫెక్ట్ గురించి చెప్పుకున్నట్టే కేసీఆర్ ఎఫెక్ట్ గురించి కూడా చెప్పుకోవాలి. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుంది అనడానికి తెలంగాణ విజయగాథనే నిదర్శనం. కోటి ఇండ్లకు శుద్ధి చేసిన తాగునీటిని అందించిన ఏకైక రాష్ట్రం భారతదేశంలో తెలంగాణ ఒకటి. 80 మీటర్ల సముద్ర మట్టం నుంచి 618 మీటర్లకు నీటిని తీసుకెళ్లే ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఇన్ లాండ్ ఫిషరీస్‌లో తెలంగాణ నెంబర్ వన్. పారిశ్రామిక అవసరాల కోసం తగినంత నీటిని అందుబాటులో ఉంచిన రాష్ట్రం తెలంగాణ. కేసీఆర్ హయాంలో ఫ్లోరోసిస్ పూర్తిగా నిర్మూలించబడింది. హైదరాబాద్ లాంటి నగరానికి నీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారాన్ని కేసీఆర్ చూపించారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు ప్రతినిధిగా మీ భాగస్వామ్యం కోసం వచ్చాను. మనం కలిసి అద్భుతాలు చేయవచ్చు. తెలంగాణకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని నేను బలంగా నమ్ముతున్నాను. ఈ ప్రపంచానికి ఇండియానే భవిష్యత్తు. తెలంగాణ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

## విద్యుత్ రంగంలో దేశానికే తెలంగాణ దిక్సూచీ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో దేశానికి దిక్సూచి కావాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు వెళుతోందని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రజాభవన్‌లో శనివారం విద్యుత్ ఉద్యోగులకు డీఏ ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

ఉద్యోగుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఇందులో భాగంగా విద్యుత్ ఉద్యోగులు , పెన్షనర్లకు 1.944 శాతానికి డీఏని పెంచినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్ప మనసుతో తీసుకున్న నిర్ణయం ఫలితంగా రాష్ట్రంలోని 71,417 ఇది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

16.018% శాతానికి చేరిన డీఏ

భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఈ పెంచిన డిఎ విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్ల తో పాటు ఆర్టిజన్స్ కు వర్తిస్తుందని అన్నారు. గతంలో 14.074% గా ఉన్న డీఏ ను 16.018% శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పెంచిన డిఎ ఈ సంవత్సరం జనవరి నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. పెంచిన డీఏతో విద్యుత్ సంస్థపై ప్రతి నెల 11.193 కోట్ల రూపాయల భారం పడుతుందని చెప్పారు. అయినా ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

రెండు వేల మెగావాట్ల డిమాండ్ అదనంగా పెరిగింది

భట్టి విక్రమార్క మాట్లాడుతూ మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో పోటీ ప్రపంచంలో ప్రతి ఉత్పత్తికి విద్యుత్తు అనివార్యమైందన్నారు. 2023 మార్చిలో 15 వేల మెగావాట్ల పీక్ డిమాండ్ రాగా, 2025 మార్చిలో 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే అదనంగా 2000 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చింది. అయినప్పటికీ ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగులు ఓ కుటుంబం మాదిరిగా శ్రమించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరాను చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ తీవ్రంగా పెరగనుందని అన్నారు.

మరో ఐదేళ్లలో 26,299 మెగావాట్ల విద్యుత్ డిమాండ్

రాష్ట్రంలో 2029-30 నాటికి 26,299 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడ నుందని భట్టి అంచనా వేశారు. 2034-35 నాటికి 33, 773 మెగావాట్ల డిమాండ్ ఏర్పడుతుందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదిక ఇచ్చిందని వివరించారు. భవిష్యత్తు డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 తీసుకువచ్చి 2029-30 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు.

భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం, విద్యుత్ ఉద్యోగులు ఒక ఆదర్శ కుటుంబం అని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. కార్యక్రమంలో జెన్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు రత్నాకర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు శివాజీ, 1104 యూనియన్ నేత సాయిబాబా, 327 యూనియన్ నాయకులు శ్రీధర్ , పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకుడు బేసిరెడ్డి, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకుడు శ్యామ్ మనోహర్, 1535 యూనియన్ నాయకులు వజీర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు సత్యనారాయణ, టీఆర్‌వీకేఎస్ యూనియన్ నాయకులు కరెంటు రావు తదితరులు పాల్గొన్నారు.

## పదేండ్లుగా భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన : మంత్రి పొంగులేటి

తెలంగాణలో దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ పాలనలో రెవెన్యూ వ్యవస్థ భ్రష్టు పట్టిందని, విధ్వంసమైన వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వరాష్ట్రంలో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో భూ భారతికి ముందు భూ భారతి తర్వాత స్పష్టమైన మార్పు కనిపిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో మంత్రి శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాటి ప్రభుత్వం ఎంతో గొప్పగా 2020లో తీసుకువచ్చిన ఆర్వోఆర్ చట్టాన్ని తిరగరాసి పారదర్శక పాలనకు పెద్ద పీట వేస్తూ రైతులు కష్టాలు తీర్చడమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. పదేళ్లలో రైతులు పడ్డ కష్టాలు, బాధలు.. ఏ విధమైన సమస్యలను ఎదుర్కొన్నారో చెప్పడానికి ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మూడు దశల్లో దాదాపు 10 లక్షలకు పైగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏప్రిల్ 14వ తేదీన భూ భారతి చట్టాన్ని ఆవిష్కరించుకున్నామని, నాటి నుంచే రెవెన్యూ వ్యవసస్థలో నూతన శకం ప్రారంభమైందన్నారు. ఈ చట్టాన్ని దశల వారీగా అమలులోకి తీసుకొస్తున్నామన్నారు.

అత్యధికం ఖమ్మంలోనే..


మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన 72 రెవెన్యూ సదస్సుల్లో 12వేల దరఖాస్తులు, తర్వాత రెండో దశలో మే 5వ తేదీ నుంచి 28 మండలాల్లో నిర్వహించిన 414 సదస్సుల్లో 46 వేల దరఖాస్తులు వచ్చాయని మంత్రి చెప్పారు. ఇందులో సాదాబైనామాల అంశం మినహా సుమారు 60 శాతం పైగా సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 561 మండలాల్లో 10,239 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించామని, భూ సమస్యలకు సంబంధించి 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. మూడు విడతల్లో 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ఇందులో 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేలు, భద్రాద్రి కొత్తగూడెం 61 వేలు, వరంగల్ 54 వేలు, జయశంకర్ భూపాలపల్లి 48 వేలు, నల్గొండ 42 వేల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. రెవెన్యూ సదస్సులకు ముందు రోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులను ఇచ్చామని, ఎమ్మార్వో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారన్నారు. స్వీకరించిన వాటికి రశీదులను అందచేసినట్లు చెప్పారు. దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం చేశారని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

# కేసీఆర్, కేటీఆర్‌కు ఇంకా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్, కేటీఆర్‌కు ఇంకా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు. ఫోన్ ట్యాపింగ్‌కు వారే కారణం.సీఎంవోను అడ్డాగా చేసుకుని ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్ చేశారు. ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం మర్యాదలు చేయడం ఆపాలి. పేపర్ లీక్ కేసులో ఆయన ఆదేశాలతోనే నన్ను అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభాకర్‌రావు అండ్ కోను కాపాడే ప్రయత్నాలు చేస్తోంది. ప్రభాకర్‌రావు భారత్‌కు వచ్చేముందు కేటీఆర్ అమెరికా ఎందుకు వెళ్లారు? నాకు సిట్ అధికారుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వారు వచ్చి విచారిస్తామన్నారు" అని బండి సంజయ్ తెలిపారు.

## ఆ నీళ్లను మళ్లిస్తాం.. పాక్ గొంతు ఎండాల్సిందే: అమిత్ షా



సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటి కొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు.

ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం. కానీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ, ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు" అని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. "భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం. ఇన్నాళ్లూ పాక్ అన్యాయంగా నీటిని అందుకుంది. ఇకపై ఆ దేశం గొంతు ఎండాల్సిందే" అని అమిత్ షా దుయ్యబట్టారు.

## స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరు క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకుంటున్నాం: డీజీపీ జితేందర్



ప్రజల కోసం పని చేసే పోలీసు అధికారులను వారు ఎప్పుడూ అభిమానిస్తారని తెలంగాణ డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లతో డీజీపీ సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో గత కొంతకాలంగా డీజీపీ సమావేశమవుతూ.. వారికి వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

డీజీపీతో పాటు మరికొందరు అధికారులు వారికి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. దాదాపు 80 శాతం మంది ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ పూర్తి చేశామని డీజీపీ తెలిపారు. సిద్దిపేట, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, నారాయణపేట, సూర్యాపేట జిల్లాల్లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లందరికీ ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని పేర్కొన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, బాధితులను రక్షిస్తూ పనిచేయాలని డీజీపీ సూచించారు. వారి పని తీరును క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకుంటున్నామని, దాదాపు పది పోలీస్ స్టేషన్లపై ప్రజలు వందశాతం సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లు ప్రజల ఆదరణ పొందాలని సూచించారు.

# హైడ్రా ఏర్పడకముందు చేపట్టిన నిర్మాణాల జోలికెళ్లం: కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ): సొంతింటి కలను సాకారం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమైందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇల్లు కొనేందుకు రుణాలిచ్చే ముందు అన్ని విధాలా సరి చూసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ వాల్యుయర్స్, రిజిస్టర్డ్ వాల్యుయర్స్ ఫౌండేషన్, IOV హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ట్రాన్స్‌ఫర్మేటివ్ ఎరాలో వాల్యుయేషన్' అంశంపై జరిగిన జాతీయ సదస్సులో రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

గతేడాది జులై 19న హైడ్రా ఏర్పడిందని.. అంతకుముందు వెలసిన నివాస ప్రాంతాలతో పాటు, అనుమతులు పొంది నిర్మాణ దశలో ఉన్న వాటి జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలు కాదు.. పర్యావరణ హితమైన నగరాభివృద్ధికి దోహదం చేసే సంస్థగా అందరూ గుర్తిస్తున్నారని వివరించారు. సుస్థిర వ్యాపారానికి హైడ్రా దోహదం చేస్తోందని అందరూ గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి మోసాలకు ఆస్కారం లేకుండా సొంతింటి కలను సాకారం చేయడంలో రియల్ ఎస్టేట్ సంస్థలతో పాటు, ఆ ఇంటికి రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలు కూడా బాధ్యత వహించాలని రంగనాథ్ సూచించారు.

సర్వే నంబర్ ఒకటి చూపించి.. వేరే చోట ఇళ్ల నిర్మాణం చేపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలకు ఆస్తి విలువలను నిర్ణయించడంలో పారదర్శకత, నమ్మకం, కచ్చితత్వాన్ని నిర్ధరించడంలో వాల్యుయేషన్ నిపుణుల పాత్ర చాలా కీలకమైందన్నారు. స్థిరాస్తుల విలువ నిర్ధరించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత ఉపయోగంగా ఉన్నా.. క్షేత్రస్థాయి పరిశీలన కూడా అంతే ముఖ్యమన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి.. వరద ముప్పులేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలనేది హైడ్రా లక్ష్యమని రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే చెరువులు, నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలను నిరోధించి.. ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడేందుకు హైడ్రా ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో వెయ్యికి పైగా ఉన్న చెరువుల పునరుద్ధరణ జరిగి.. పార్కులన్నీ పచ్చగా ఉన్నప్పుడు పర్యావరణ సమతుల్యత సాధించగలుగుతామన్నారు.

# మామ అల్లుళ్ల ద్రోహం

## బయటపడుతుందనే బీఆర్ఎస్ తికమక : ఆది శ్రీనివాస్



హైదరాబాద్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):మామ అల్లుడు గడిచిన పదేళ్లు తెలంగాణ ప్రజలకు చేసిన ద్రోహాన్ని ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు కళ్లకు కట్టినట్లు తేటతెల్లం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ మాత్రం అబద్ధాలతో ప్రజలకు తికమక పెట్టే ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. పదేళ్లు తెలంగాణ సెంటిమెంట్ తో పబ్బం గడిపిన బీఆర్ఎస్ ఇప్పుడు మళ్లీ అదే సెంటిమెంట్ రంగరించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్ లోని సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ హయాంలో రైతులు అరిగోస పడ్డారని ఆరోపించారు. బనకచర్లను బీఆర్ఎస్ వాళ్లే హైలెట్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ ప్రాజెక్టును మా ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తూ కేంద్ర జల వనరుల శాఖకు లేఖలు కూడా రాసినట్లు గుర్తు చేశారు. బనకచర్ల పాపం అంతా గత ప్రభుత్వానిదేనన్నారు. మామ అల్లుళ్లే చిల్లర పంచాయతీ పెడుతున్నారని బేషన్లు, బేషజాలు లేవని చెప్పింది మీ మామ కేసీఆర్ కాదా హరీశ్ రావు అని ప్రశ్నించారు. కృష్ణా ఆయకట్టుకు గోదావరి నీళ్లు ఇస్తామని చెప్పింది కేసీఆర్ కాదా అన్నారు. హరీశ్ రావు ఎంత బుకాయించినా ప్రజలు మిమ్మల్నీ తిరస్కరించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీ ముఖ్యమంత్రితో చర్చలు జరిపితే చాణిక్య నీతి అదే రేవంత్ రెడ్డి చర్చలు జరిపితే మ్యాచ్ ఫిక్సింగా అని మండిబడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్క హామీని నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుంటే దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. బనకచర్ల విషయంలో ఏపీ చర్యలను కేంద్రం అడ్డుకోవాలని, కేంద్రం పట్టించుకోకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తామన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ బనకచర్ల ప్రాజెక్టుపై జోక్యం చేసుకోవాలన్నారు.

# మందు సీసాల తరలింపుకు స్పెషల్ జాకెట్



ఆదిలాబాద్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):ఆదిలాబాద్ జిల్లా మద్యం అక్రమ రవాణాకు కేంద్రంగా మారింది. మహారాష్ట్ర నుంచి మద్యం సీసాలను కొత్త ఎత్తుగడలతో తరలిస్తున్న కేటుగాళ్లను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. పోలీసుల నివేదిక ప్రకారం.. దేశిదారు మద్యం తరలింపులో నూతన మార్గాలు వెతుక్కుంటూ ప్రత్యేకంగా తయారు చేసిన జాకెట్లను దుండగులు ఉపయోగిస్తున్నారు. మద్యం సీసాలను ఈ జాకెట్లలో దాచిన వీరంతా వాటిని ఒంటిపై వేసుకొని రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఈ కుట్ర బట్టబయలైంది.

మూడు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఆపరేషన్‌లో సుమారు రూ.5 వేల విలువగల 140 మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అశోక్, రజిత, అరుణ్ అనే ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరంతా మహారాష్ట్ర నుంచి మద్యం తీసుకొచ్చి తెలంగాణ గ్రామాల్లో విక్రయాలు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అధికారులు మాట్లాడుతూ.. ఇటువంటి అక్రమ రవాణా ఘటనలపై గట్టి నిఘా పెట్టినట్లు తెలిపారు. మద్యం అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం:డీజీపీ జితేందర్




హైదరాబాద్,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ డీజీపీ జితేందర్ హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల చాలా అనర్థాలు జరుగుతాయని అన్నారు. యవత వీటి బారిన పడొద్దని.. విలువైన జీవితాన్ని కోల్పోవద్దని సూచించారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రభుత్వం, పోలీసులు కృతనిశ్చయంతో పని చేస్తున్నారని అన్నారు. శనివారం తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ అవేర్నెస్ వీక్‌ని డీజీపీ జితేందర్ ప్రారంభించారు. జూన్ 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ నిర్వహిస్తున్నారు.

వారోత్సవాల్లో భాగంగా డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు నార్కోటిక్ బ్యూరో అవగాహన కల్పించనుంది. డ్రగ్ అవేర్నెస్ వీక్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, TGANB డైరెక్టర్ సందీప్ శాండిల్య, వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో దురదృష్టవశాత్తూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మెంటల్ హెల్త్‌తో పాటు ఫిజికల్ హెల్త్‌ను నాశనం చేస్తుందని చెప్పారు. విద్యార్థులు మీ జీవితం అనే పుస్తకంలో మంచి విషయాలు మీరే రాసుకోవాలని సూచించారు. నో టు డ్రగ్స్ అనే నినాదం జనాల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.ఫ్రెండ్స్, కుటుంబ సభ్యుల్లో ఒక్కో విద్యార్థి పదిమందికి సే నోటు డ్రగ్స్ అని చెప్పాలని డీజీపీ జితేందర్ కోరారు.

### మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దు:సందీప్ శాండిల్య

విద్యార్థుల మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని TGANB డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. విద్యార్థులతో యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా సందీప్ శాండిల్య ప్రమాణం చేయించారు. డ్రగ్స్ వ్యతిరేకంగా పని చేస్తామని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లమని విద్యార్థులు ప్రమాణం చేశారు.

### విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: కలెక్టర్ హరిచందన

పాఠశాలల్లో డ్రగ్స్‌ని గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన సూచించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పని చేస్తామని విద్యార్థులతో కలెక్టర్ హరిచందన ప్రమాణం చేయించారు. సే నోటు డ్రగ్స్ అనే నినాదం అందరికీ చేరేలా చేయాలని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం విద్యార్థులు అందరూ పని చేయాలని కలెక్టర్ హరిచందన కోరారు.

# బ్లాక్‌మెయిల్ చేసినందుకే కౌశిక్‌రెడ్డి అరెస్ట్.. బల్మూరి వెంకట్



హైదరాబాద్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌ను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఖండిస్తున్నందుకు సిగ్గుండాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. పైసల దందాలో కౌశిక్‌రెడ్డి అరెస్ట్ అయ్యారని ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు ఒక్క దొంగకి సపోర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై కౌశిక్‌రెడ్డి ఏమైనా ఉద్యమం చేశారా అని ప్రశ్నించారు. పైసల కోసం క్రషర్ వాళ్లని బ్లాక్‌మెయిల్ చేసినందుకు కౌశిక్‌రెడ్డిని తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్. .

కౌశిక్‌రెడ్డిది బ్లాక్‌మెయిల్ చరిత్ర అని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. ప్రజలను మోసం చేసిన చరిత్ర కౌశిక్ రెడ్డిదని విమర్శించారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి కౌశిక్‌రెడ్డి చాలా పైసలు తీసుకున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ దొంగలను బయట దేశాలకు పంపించినట్లుగా కౌశిక్‌రెడ్డిని కూడా దేశం దాటించాలని చూశారని ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడారు. తమ ఎమ్మెల్యే బ్లాక్ మెయిలర్ అని హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు బాధ పడుతున్నారని చెప్పారు. కౌశిక్‌రెడ్డిని గెలిపించినందుకు చాలా బాధపడుతున్నారని పేర్కొన్నారు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్.

కేటీఆర్, హరీశ్‌రావులు దొంగలకు సపోర్ట్ చేయొద్దని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హితవు పలికారు. మీరు చేసిన దొంగతనాలు బయట పడతాయని బావ బామ్మర్దులు బనకచర్ల విషయంలో ముందుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బనకచర్ల విషయంలో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో లోపాయికారి ఒప్పందాలు చేసుకుంది మీరు కాదా అని ప్రశ్నించారు. బావ బామ్మర్దులకు దమ్ము ధైర్యం ఉంటే బనకచర్ల విషయంలో ప్రమాణం చేయాలని బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. వాసాలమర్రిలో ఆగమ్మకు ఇల్లు ఇస్తామని మాజీ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని.. ఆ హామీ ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. కేసీఆర్ పేపర్ టైగర్ అని ఎద్దేవా చేశారు. ఆగమ్మకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వెల్లడించారు.

# యోగాతో శాంతి, ఆరోగ్యం, ఆనందం : స్పీకర్ ప్రసాద్ కుమార్




వికారాబాద్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ): యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు, ఒక జీవన విధానం అని తెలంగాణా రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్లో జరిగిన యోగా డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, విద్యార్థులతో కలిసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ యోగ కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకొని ఆచరించాలన్నారు. యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు, ఒక జీవన విధానమని నేను రోజు యోగా చేస్తానని తెలిపారు. యోగాను నిత్యం సాధన చేయడం ద్వారా మనిషిలో ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చని శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. ఇటీవల కాలంలో యోగా పట్ల ప్రజలలో ఆసక్తి బాగా పెరిగిందని ఎక్కువ మంది యోగాను చేస్తున్నారని పేర్కొన్నారు.

భారతదేశంలో 2500 సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి ద్వారా యోగ వెలుగులోకి వచ్చిందని ఆయన అన్నారు. ఐక్యరాజ్యసమితి యోగా ప్రాముఖ్యాన్ని గుర్తించి ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించిందని పేర్కొన్నారు. యోగాను అన్ని వయసుల వారు చేయవచ్చుని, సొంతంగా కంటే గురువుల మార్గదర్శకంలో చేస్తే ఎక్కువ ఫలితాలు ఉంటాయని ఆయన అన్నారు. యోగాను మీ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యంగా, మానసికంగా ప్రశాంతంగా జీవిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజలందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుదీర్, డీఎస్పీ శ్రీనివాస్, యువజన క్రీడల అభివృద్ధి అధికారి (ఇంచార్జి) మహమ్మద్ అబ్దుల్, సత్తార్, ఎల్ డి ఎం యాదగిరి, అయుష్ సునీత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఏపీలో రానున్న రెండు రోజుల్లో వర్షాలు.. పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వానలు



క్రాంతి న్యూస్ :ఈ ఏడాది ముందుగాను రుతుపవనాలు పలకరించడంతో దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. ఏపీ, తెలంగాణలో వానలు దంచికొట్టాయి. కాగా కొద్ది రోజులుగా వానలు ముఖం చాటేయడంతో అన్నదాతలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. కప్పతల్లి ఆటలాడుతూ వరుణ దేవుడిని కరుణించమని వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ వాతావరణ శాఖ గుడ్ న్యూస్ అందించింది. రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు.

## యోగా గ్రాండ్ సక్సెస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష



విశాఖపట్నం, జూన్ 21: యోగాడే నిర్వహణ, గ్రాండ్ సక్సెస్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. శనివారం విశాఖ కలెక్టర్ కార్యాలయంలో మంత్రులు, అధికారులతో సీఎం రివ్యూ చేపట్టారు. సమావేశ మందిరంలోకి సీఎం చంద్రబాబుకు కరతాళధ్వనులతో మంత్రులు, అధికారులు స్వాగతం పలికారు. విశాఖతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఇంటర్నేషనల్ యోగా డే జరిగిన తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా పలు ప్రపంచ రికార్డుల సాధనపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉద్యోగులు, అధికారులకు సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రజల సహకారం, భాగస్వామ్యం, అన్నివిభాగాల సమన్వయంతో యోగా డే గ్రాండ్ సక్సెస్ అయ్యిందన్నారు ముఖ్యమంత్రి.

మంచి కార్యక్రమంలో ఇదో గొప్ప ముందడుగు అని వ్యాఖ్యానించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతో బాధ్యత తీసుకుని పనిచేసిన తీరుకు అభినందనలు తెలిపారు. అర్ధరాత్రి 2 గంటల నుంచే ప్రజలు తరలిరావడం ఆశ్చర్యాన్ని కలిగించిందని కొందరు అధికారులు తెలిపారు. విశాఖ యోగా డేలో 3 లక్షల మందికి పైగా యోగా సాధనలో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. పాల్గొన్నవారి లెక్కింపులో క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం తిరుగులేని ఫలితాన్ని ఇచ్చిందని మంత్రులు పేర్కొన్నారు.

## సత్యవేడు మండలంలోని పరిశ్రమలో అగ్ని ప్రమాదం



సత్యవేడు,21 జూన్ ( క్రాంతి న్యూస్ ) : తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చిన్ని ఈటిపాకం పంచాయతీ పాలగుంట గ్రామంలోని ఓ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు భారీగా వ్యాపించడంతో విధుల్లో ఉన్న 60 మంది సిబ్బంది బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో భారీగా ఆస్తినష్టం జరిగిందని యజమానులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అగ్నిమాపక అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు షాక్.. కొత్త రూల్ అమలు



అమరావతి ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ): ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీలో మిగిలిన డబ్బును తిరిగి ప్రభుత్వానికి జమ చేయడంలో ఆలస్యం జరుగుతోందని.. డబ్బులు జమ చేయడంలో ఆలస్యం జరగకుండా సెర్ప్ అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పింఛన్ పంపిణీ అయిపోయిన రెండు రోజుల్లోనే డబ్బులు ప్రభుత్వానికి చేరాలని.. కానీ చాలామంది 20 రోజులు దాటినా జమ చేయడం లేదంటున్నారు అధికారులు. 7 రోజుల్లో డబ్బులు తిరిగి చెల్లించాలని.. డబ్బులు సకాలంలో జమ చేయకపోతే చర్యలు తీసుకుంటామని.. హెచ్చరిస్తూ అన్ని జిల్లాలలోని సిబ్బందికి సెర్ప్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పంపిణీ చేస్తున్నారు. అయితే ప్రతి నెలా ఒకటి, రెండు తేదీల్లో పింఛన్లు పంచిన తర్వాత మిగిలిన డబ్బును వెంటనే ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. కానీ కొందరు గ్రామ, వార్డు సిబ్బంది డబ్బులు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నారట. జూన్ నెలలో రూ.2,717.89 కోట్లు పింఛన్ల కోసం కేటాయించగా.. అందులో రూ.2,651.88 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయితే రూ.66 కోట్లు మిగిలి ఉండగా.. ఇప్పటివరకు రూ.62 కోట్లు సెర్ప్ ఖాతాకు చేరాయంటున్నారు.

కొంతమంది పింఛన్ లబ్ధిదారులు డబ్బులు తీసుకోకపోతే.. ఆపై వచ్చే నెలలో రెండు నెలల పింఛను కలిపి పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అందుకే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు డబ్బులు తిరిగి ఇవ్వడంలో ఆలస్యం జరగకుండా సెర్ప్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అందుకే ప్రతి నెలలో పింఛను పంపిణీ అయిపోయిన తర్వాత వారం రోజుల్లోగా మిగిలిన డబ్బును సెర్ప్ ఖాతాలో జమ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే ఇటీవల కాలంలో కొందరు సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీ చేయాల్సిన డబ్బులతో ఉడాయించిన సందర్భాలు ఉన్నాయి.. అయితే ఆ తర్వాత ఆ డబ్బుల్ని ప్రభుత్వ తిరిగి రికవరీ చేసింది. ఇలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం పింఛన్ పంపిణీ అయిపోయిన వెంటనే డబ్బుల్ని తిరిగి ప్రభుత్వానికి అందజేయాలని కోరుతోంది.

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను సస్పెండ్ చేయాలి.. వైసీపీ డిమాండ్



గుంతకల్లు ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ): మాజీ మంత్రి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు గుంతకల్ మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, వైవీఆర్.. నిన్నటి దినం గుత్తి పట్టణంలో టీడీపీ పట్టణ మండల కమిటీ సమావేశాల ఏర్పాటులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.. వైసీపీ కార్యకర్తలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.. దీనిపై స్పందించిన గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ నేతలు నామినేషన్లు వేస్తే తోకలు కత్తిరిస్తాం అన్న గుమ్మనూరు జయరాంను ఎమ్మెల్యే పదవి నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.. వైసీపీ కార్యకర్తల జోలికి వచ్చి బెదిరించి ధోరణితో మాట్లాడితే వాటికి ఎలా బుద్ధి చెప్పాలో మాకు తెలుసునని, రాజకీయాలు అంటే మాకు ఏమీ కొత్త కాదని.. ప్రత్యేకంగా గుమ్మనూరు జయరాం గురించి నాకు బాగా తెలుసని.. ఆయన చరిత్ర ఏమో.. ఏ విధంగా పైకి వచ్చాడో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. గుంతకల్ నియోజకవర్గంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు ప్రయత్నించేసుకోవాలి.. అలా కాకుండా మా వైసీపీ కార్యకర్తలకు భయపెట్టే ధోరణితో మాట్లాడితే తగిన రీతిలో బుద్ధి చెప్తామని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు మాజీ ఎమ్మెల్యే వెంకటరామరెడ్డి హెచ్చరించారు.

## ఏపీలోని ఈ హైవేలకు రూ.12వేల కోట్లు..

### ఈ రూట్‌లలోనే రెండు, నాలుగు లైన్లుగా..



ఏపీ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హైవేలకు సంబంధించి కేంద్రం నుంచి డబ్బులు వచ్చాయి. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ పలు జాతీయ రహదారులను అభివృద్ధి చేయడానికి నిధుల్ని మంజూరు చేసింది. కొన్ని హైవేలను పది మీటర్ల వెడల్పుతో రెండు వరుసలుగా.. మరికొన్నింటిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. 2025-26కి సంబంధించి 457 కిలోమీటర్ల మేర హైవే పనుల కోసం రూ.12,152 కోట్లు మంజూరు చేశారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న హైవేల విస్తరణ, బ్రిడ్జిల నిర్మాణం, రైల్వే క్రాసింగ్‌ల దగ్గర ఫ్లైఓవర్ల నిర్మాణాల పనులు ఊపందుకున్నాయి.

కృష్ణా జిల్లాలోని పెడన నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని లక్ష్మీపురం వరకు ఉన్న నేషనల్ హైవే-216ని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ హైవేకు సంబంధించి రూ.4,245 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ హైవే కత్తిపూడి-ఒంగోలు హైవేలో పెడన దగ్గర మొదలవుతుంది.. ఇబ్రహీంపట్నం-జగదల్‌పూర్ హైవేలో లక్ష్మీపురం దగ్గర కలుస్తుంది. మొత్తం 118 కిలోమీటర్ల మేర హైవేను విస్తరిస్తారు.

పశ్చిమగోదావరి జిల్లాలో పామర్రు నుంచి పాలకొల్లు సమీపంలోని దిగమర్రు వరకు నేషనల్ హైవే-165లో ఆకివీడు నుంచి దిగమర్రు మధ్య 45 కిలోమీటర్ల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ రోడ్డు కోసం రూ.2,500 కోట్లు కేటాయించింది కేంద్రం. కడప జిల్లాలో ఎన్‌హెచ్-716లో ముద్దనూరు నుంచి కడప వరకు ఉన్న 48 కిలోమీటర్ల హైవేను నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఈ రోడ్డుకు రూ.1,182 కోట్లు కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ నుంచి కదిరి వరకు 22 కిలోమీటర్ల హైవేని నాలుగు లైన్లుగా మార్చేందుకు రూ.428 కోట్లు కేటాయించింది కేంద్రం.

మచిలీపట్నం నుంచి పోర్టు వరకు ఉన్న 8 కిలోమీటర్ల హైవేను రూ.584 కోట్లతో నాలుగు లైన్లుగా విస్తరించనున్నారు. అయితే ఈ రోడ్డును ఆరు వరుసలుగా మార్చేందుకు ప్రతిపాదనల్ని పరిశీలించాలని కేంద్రం సూచించింది. కడప-రాయచోటి హైవేలో గువ్వలచెరువు ఘాట్ దగ్గర రూ.920 కోట్లతో 8 కిలోమీటర్ల మేర నాలుగు లైన్లతో సొరంగం నిర్మిస్తారు. రూ.735 కోట్లతో అమలాపురం నుంచి రావులపాలెం వరకు 7 మీటర్ల వెడల్పుతో ఉన్న 32 కిలోమీటర్ల హైవేని పది మీటర్లకు విస్తరిస్తారు.

జీలుగుమిల్లి-కొవ్వూరు హైవేలో 86 కిలోమీటర్లు ఉంటే.. ఇప్పటికే 40 కిలోమీటర్లు హైవేను రెండు లైన్లుగా విస్తరించారు. అయితే మిగిలిన 46 కిలోమీటర్లను విస్తరిచేందుకు రూ.495 కోట్లు విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. హైవే-167కె లో.. నంద్యాల జిల్లా నల్లకాలువ-వెలుగోడు మధ్య 17 కిలోమీటర్ల రోడ్డును రూ.400 కోట్లు ఖర్చుతో పది మీటర్ల వెడల్పుతో రెండు లైన్లుగా మారుస్తారు. ఈ క్రమంలో ఎమ్మిగనూరు దగ్గర 9 కిలోమీటర్ల బైపాస్ రోడ్డును రూ.225 కోట్లతో నిర్మిస్తారు. మరికొన్ని వంతెనలకు డబ్బులు కేటాయించారు. ఈ ప్రాజెక్టులన్నింటికీ పూర్తి డీపీఆర్‌లు సిద్ధం చేయాల్సి ఉంటుంది. అనంతరం MORTH అధికారులు వాటిని పరిశీలించి అనుమతించిన తర్వాత డబ్బులకు లైన్ క్లియర్ చేస్తారు.. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారు.

## భార్యను హత్య చేసి.. గొంతు కోసుకున్న భర్త



గుంటూరు,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):గుంటూరు జిల్లా కన్నవారితోటలో దారుణం జరిగింది. రాజు అనే వ్యక్తి తన భార్యను హత్య చేసి, అనంతరం గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న నగరంపాలెం పోలీసులు సంఘటన స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ దస్త్రాలపై మంత్రి అడ్లూరి తొలి సంతకం



హైదరాబాద్,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ బాధ్యతలు చేపట్టిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆయా వర్గాల సంక్షేమానికి సంబంధించిన దస్త్రాలపై సంతకాలు చేశారు. దివ్యాంగుల స్వయం ఉపాధి యూనిట్లకు రూ.5 కోట్లు మంజూరు చేశారు. దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు రూ.3.55కోట్ల రివాల్వింగ్ ఫండ్ విడుదలకు ఆమోదం తెలిపారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి ఎస్సీ లబ్ధిదారుల సంఖ్యను 210 నుంచి 500కి పెంచారు. గిరిజన విద్యా సంస్థల మరమ్మతులకు రూ.79.61కోట్లు, గిరిజన మినీ గురుకులాల నిర్వహణకు రూ.17.18 కోట్లు, మేడారం జాతర మిగిలిన పనులకు రూ.44.5కోట్లు మంజూరు చేశారు. జేఈఈ, నీట్‌లో ప్రతిభ కనబరిచిన 100 మంది గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు.

# ప్రపంచానికి మన దేశం అందించిన గొప్ప వరం యోగా : మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):భాగ్యనగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన యోగా డే కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు దామోదర రాజనర్సింహ, సీఎస్ రామకృష్ణారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజలకు యోగా విశిష్టత గురించి వివరించారు.

ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా. ఈ వరాన్ని మనకు అందించిన గురువు, మహర్షి పతాంజలి గారిని ఈ సందర్భంగా మనందరం స్మరించుకోవాలి. ఆయన అందించిన అష్టాంగ యోగా విద్యలే నేటి యోగాకు ప్రాణాధారం. కానీ, ప్రస్తుతమున్న ఉరుకుల పరుగుల జీవన శైలితో బీపీ, షుగర్, క్యాన్సర్లు, కిడ్నీ సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. కోట్లు సంపాదించేవారికి కూడా ప్రశాంతత ఉండడం లేదు. ఈ సమస్యలన్నింటికీ యోగా చక్కని పరిష్కార మార్గం. యోగా అనేది కేవలం వ్యాయామానికి సంబంధించింది కాదు. శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే అద్భుతమైన సాధనం. రోజూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, ఏకగ్రత పెరుగుతాయి. అయితే, యోగా చేయడానికి కావాల్సిందల్లా సంకల్పం, మంచి గురువు. కాబట్టి, ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యమే మహాభాగ్యమనే నానుడిని నిజం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరి జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసేందుకు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. హెల్త్ సబ్‌సెంటర్లలో రోజూ ఉదయం యోగా క్లాసులు నిర్వహిస్తున్నామని.. గతేడాది కాలంలో కొత్తగా 5 లక్షల మందికి యోగా నేర్పించామని అన్నారు. అన్ని విద్యా సంస్థల్లో యోగా నేర్పించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో పీజీ కోర్సును అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల ద్వారా ప్రజలకు యోగాను చేరువచేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీహరి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సాయి ధరమ్ తేజ్, తేజ సజ్జా, మీనాక్షి చౌదరి, ఖుష్బూ వంటి సినీ ప్రముఖులు హాజరై యోగాసనాలు వేశారు.

# ఎ.వి ఇన్‌ఫ్రాకాన్ సంస్థ చైర్మన్ విజయ్‌పై కేసు నమోదు




హైదరాబాద్,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):ఎ.వి ఇన్‌ఫ్రాకాన్ సంస్థ చైర్మన్ గోగుల విజయ్‌పై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎ.వి ఇన్‌ఫ్రాకాన్‌లో పెట్టుబడి పెడితే రెండింతలు లాభాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. స్థలాలు రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారని, నారాయణఖేడ్, యాదగిరిగుట్ట, బుదేరా ప్రాంతాల్లో వెంచర్ల పేరుతో మోసాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు అడిగితే చెల్లని చెక్కులు ఇచ్చి మోసం చేశారని తెలిపారు. దుర్గం చెరువు సమీపంలో ఎ.వి.ఇన్‌ఫ్రా కార్యాలయం నడుపుతున్న విజయ్ .. సుమారు 500మంది నుంచి రూ.కోట్ల రూపాయలు వసూలు చేశాడని పోలీసులు వెల్లడించారు.

# ఇరాన్ పై దాడులు .. మోదీ మౌనం వీడాలన్న సోనియా గాంధీ...



న్యూ ఢిల్లీ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):ఇజ్రాయెల్-ఇరాన్ల మధ్య కొనసాగుతున్న యుద్ధంపై భారత్ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తప్పుబట్టారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ మౌనం దౌత్య వైఫల్యంలా కన్పిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి భారత దేశ నైతిక, వ్యూహాత్మక సంప్రదాయం నుంచి దూరంగా జరిగినట్లుగా కనిపిస్తోందని అన్నారు. ఈ మేరకు సోనియా ఒక ప్రకటనను నేడు విడుదల చేశారు.. టెహ్రాన్ పై , టెల్ అవీవ్ చేస్తున్న దాడులు చట్టవిరుద్ధమైనవిగా.. సార్వభౌమాధికార ఉల్లంఘనగా అభివర్ణించారు.

ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల వల్ల ప్రాంతీయంగా, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయని సోనియా పేర్కొన్నారు. ఈ ఘర్షణలు అస్థిరతను మరింత తీవ్రతరం చేయడం వల్ల మరిన్ని సంఘర్షణలకు బీజాలు వేస్తాయన్నారు.ఇరాన్, అమెరికాల మధ్య అణు చర్చలకు మార్గం సుగమం అవుతున్న సమయంలో టెల్ అవీవ్ ఒక్కసారిగా టెహ్రాన్ లోని అణుస్థావరాలపై దాడులకు దిగడం సరైన చర్య కాదని సోనియా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఎంతో కాలంగా మిత్రదేశంగా ఉన్న ఇరాన్ దూరం చూసుకోవద్దని మోదీ ప్రభుత్వానికి హితవు పలికారు..మరోవైపు ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమంలో గాజాలో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రస్తుతం గాజా కరవు అంచున ఉండడంతో అక్కడ మిగిలిఉన్న ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. గాజాలో జరిగిన విధ్వంసం మళ్లీ ఇరాన్లో పునరావృతం అవకుండా మరింత ఆలస్యం అవ్వకముందే భారత్ కల్పించుకోవాలని అన్నారు.

# తెలంగాణకు పాకిన రప్పా.. రప్పా

సంగారెడ్డి,21 జూన్ ( క్రాంతి న్యూస్ ): ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌ఇటీవల పల్నాడు జిల్లా పర్యటన సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు ప్రదర్శించిన వివాదాస్పద ప్లకార్డులు రాజకీయంగా ఎంతటి దుమారాన్ని రేపాయో అందరికీ తెలిసిందే. మళ్లీ అధికారంలోకి వస్తే రప్పా.. రప్పా నరుకుతాం అంటూ వైసీపీ ప్లకార్డులు ప్రదర్శించడంపై కూటమి నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దీనిపై ఏపీలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధమే నడుస్తోంది. వివాదాస్పద ప్లకార్డులు ప్రదర్శించిన వారిని అరెస్ట్ కూడా చేశారు. ఇప్పుడు రప్పా.. రప్పా డైలాగ్ తెలంగాణకు పాకింది.




అయితే ఏపీలో ఇలాంటి పాలిటిక్స్ కొత్తేమీ కాదు. కానీ తెలంగాణలో మాత్రం ఇలాంటి రాజకీయాలను ఎవరూ ప్రోత్సహించరు కూడా. ముఖ్యంగా బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు ఇలాంటి రాజకీయాలకు దూరంగా ఉంటారు. కానీ ఇప్పుడు ఆయన పాల్గొన్న ధర్నాలోనే హరీష్ ఫోటోలతో రప్పా.. రప్పా అంటూ వెలిసిన ప్లకార్డులు సంచలనం రేపుతున్నాయి.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా ఇవ్వాలంటూ జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నాకు దిగారు. ఈ ధర్నాలో మాజీ మంత్రి హరీష్ రావు పాటు ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మానిక్ రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు ప్లకార్డులు ఏర్పాటు చేశారు. 2028లో రప్పా.. రప్పా 3.0 లోడింగ్ అంటూ ప్లకార్డుల ప్రదర్శన చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ వ్యాప్తంగా ఈ ప్లకార్డులు వైరల్‌గా మారాయి. ఇలాంటి ప్రచారం ఎప్పుడూ జరగలేదని.. కొత్తగా ఉందంటూ పార్టీ నేతలు అనుకుంటున్న పరిస్థితి.

అయితే హరీష్ రావు దృష్టిలో పడేందుకే సదరు నేత ఈ తరహా ప్రచారం చేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కచ్చితంగా గెలవబోతుందనే దానికి సంకేతంగా ఇలా ప్రచారం చేశాను తప్ప వేరే ఉద్దేశం లేదని ప్లకార్డులు ప్రదర్శించిన నేత చెప్పుకొచ్చారు. అయితే ఇప్పటి వరకు తన ఫోటోలతో వెలసిన రప్పా.. రప్పా ప్లకార్డులపై ఇటు హరీష్ రావు కానీ.. అటు బీఆర్ఎస్ అధిష్టానం కానీ స్పందించలేదు.

# 9 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు జమ..



హైదరాబాద్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):అన్నదాతలను ఆర్థికంగా ఆదుకునేందుకు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రైతు భరోసాలో భాగంగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తోంది. గత కొద్దిరోజుల నుంచి ఎకరాల వారీగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. శుక్రవారం 7 ఎకరాల వరకు పొలం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం 905.89 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

శనివారం 9 ఎకరాల వరకు పొలం ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు 66.19 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసింది. గురువారం నాడు 4,43,167 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసింది. భూమి పరంగా .. 106 లక్షల ఎకరాలకు పంట సహాయం అందించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# మానసిక ప్రశాంతతకు యోగా దివ్య ఔషధం : ఎంపీ రఘురాం రెడ్డి



ఖమ్మం,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):మానసిక ప్రశాంతతకు, శారీరక ఉల్లాసానికి, మంచి ఆరోగ్యానికి యోగా.. దివ్య ఔషధం మాదిరిగా పనిచేస్తుందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని.. శనివారం ఉదయం 6:30 గంటలకు ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. స్వయంగా యోగాసనాలు వేసి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. యోగా అనేది ఆరోగ్యానికి ఒక క్రమశిక్షణాయుతమైన దినచర్య అని అన్నారు. మన దేశంలో ఆరంభమై..ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని తెలిపారు. మహిళలు సైతం ప్రత్యేక శ్రద్ధతో యోగా తరగతులు నిర్వహిస్తుండడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా క్లాసుల నిర్వాహకులు శ్రీలత, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మహిళా నాయకురాలు చల్లా ప్రతిభారెడ్డి, కార్పొరేటర్లు, టీపీసీ మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాచలం వెళ్లే భక్తులకు గుడ్ న్యూస్..ఇకపై ఆ కష్టాలకు చెక్



భద్రాద్రి ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):భద్రాచలం వెళ్లే భక్తులకు ఆలయ ఈవో రమాదేవి గుడ్ న్యూస్ చెప్పారు. భక్తుల సౌకర్యార్థం దర్శనం, ప్రసాదం, అర్చన తదితర కార్యకలాపాలకు డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ప్రకటించారు. ఫెడరల్ బ్యాంక్ సౌజన్యంతో కియోస్క్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తద్వారావ వేగవంతంగా స్వామివారి సేవలను పొందవచ్చున్నారు. కియోస్క్ అచ్చం రైల్వే స్టేషన్‌లో ఉండే మిషిన్ మాదిరిగా ఉంటుంది. ఇందులో డెబిట్ కార్డులు లేదా యూపీఐ ద్వారా అవసరమైన సేవలకు సంబధించిన టికెట్లను బుక్ చేసుకోవచ్చు. సాధారణంగా ఆలయాల్లో టికెట్ కౌంటర్ వద్ద సేవలకు సంబంధి టికెట్లు అందిస్తారు. కానీ ప్రస్తుతం అందుబాటులోకి తీసుకువచ్చిన విధానం ద్వారా మరింత సులువుగా త్వరగా అవసరమైన టికెట్లు తీసుకోవచ్చు.

# ఆరోగ్య క్రాంతి

epaper.krtvnews.com

## కిడ్నీలు ఫెయిల్ అవడానికి ఇవే కారణాలా..?


హెల్త్ న్యూస్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ): కిడ్నీలు రెస్ట్ లేకుండా పనిచేసి రక్తాన్ని శుభ్రంగా ఉంచుతాయి. రక్తంలో ఎక్కువగా ఉండే నీటిని, ట్యాక్సిన్స్‌ని వడకట్టి రోజులో దాదాపు 200 లీటర్ల రక్తాన్ని ఫిల్టర్ చేస్తాయని చెబుతారు. మూత్రపిండాలు రెండు చిక్కుడు గింజ ఆకారంలో ఉండే అవయవాలు. ఒక్కొక్కటి పిడికిలి ఆకారంలో ఉంటాయి. అవి పక్కటెముక క్రింద, వెన్నెముకకి ప్రతివైపు ఒకటి చొప్పున ఉంటాయి. హెల్దీ కిడ్నీలు ప్రతి నిమిషం అరకప్పు రక్తాన్ని ఫిల్టర్ చేస్తాయి. వ్యర్థాలను, మూత్రాన్ని తయారుచేయడానికి అదనపు నీటిని తొలగిస్తాయి. ఇన్ని పనులు చేసే కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మరికొన్ని ఫుడ్స్ తీసుకోవాలి.

**పెయిన్ కిల్లర్స్ వాడడం**

ఎక్కువగా పెయిన్ కిల్లర్స్ వాడడం కూడా మంచిది కాదు. అవి మూత్రపిండాలకు కూడా హానికి కలిగిస్తాయి. ముఖ్యంగా మీకు ఇప్పటికే కిడ్నీ ప్రాబ్లమ్ ఉంటే నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ వాడకాన్ని తగ్గించండి. ఇవి ఎప్పుడు కూడా మోతాదుని మించి వాడొద్దు. ఈ మెడిసిన్ విషయంలో జాగ్రత్త పడాలి.

**ఉప్పు**

ఉప్పు, సోడియం ఎక్కువగా ఉన్న ఫుడ్ బీపిని పెంచుతుంది. దీని వల్ల కిడ్నీలకు హాని కలిగిస్తుంది. ఉప్పు బదులుగా మూలికలు, సుగంధద్రవ్యాలతో ఆహారాన్ని రుచి చూడండి. ఇవి కూడా అంతే రుచిగా ఉంటుంది. మీ క్రేవింగ్స్‌ని కంట్రోల్ చేస్తాయి. మీ డైట్‌లో తక్కువ ఉప్పు వాడాలి.



**ప్రాసెస్ ఫుడ్**

ఓ అధ్యయనం ప్రకారం ప్రాసెస్డ్ ఫుడ్ తినడం వల్ల ఎక్కువగా తినేవారికి మూత్రపిండాల వ్యాధి ప్రమాదం 24 శాతం ఎక్కువగా ఉందని తేలింది. ఈ ఫుడ్స్ ఎక్కువగా ప్రాసెస్ చేస్తారు. ఇందులో యాడెడ్ షుగర్, ఆర్టిఫిషియల్ ఆడిటివ్స్, రిఫైండ్ కార్బ్స్, అన్‌హెల్దీ ఫ్యాట్స్, సోడియంతో నిండి ఉంటాయి. కానీ, ఫైబర్, ప్రోటీన్, అవసరమైన పోషకాలు తక్కువగా ఉంటాయి. పండ్లు, కూరగాయలు, ధాన్యాల వంటి ఆహారాలు తీసుకోవాలి. ఆహారాన్ని మార్చే ముందు హెల్త్‌కేర్ ప్రొవైడర్‌తో మాట్లాడాలి.

**తగినంత నీరు తాగకపోవడం**

తగినంత నీరు తాగకపోవడం మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా మీరు కష్టపడి పనిచేస్తున్నప్పుడు, వేడివాతావరణంలో ఉంటే నీరు మూత్రపిండాల వ్యర్థాలను తొలగించడంలో సాయపడుతుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్లని తగ్గించడంలో కూడా సాయపడుతుంది.

**నిద్రలేకపోవడం**

మంచి నిద్ర కూడా చాలా ముఖ్యం. మూత్రపిండాల పనితీరు నిద్ర మేల్కొలుపు చక్రం ద్వారా నియంత్రించబడుతుంది. ఇది 24 గంటల పాటు మూత్రపిండాల పనిభారాన్ని బ్యాలెన్స్ చేయడానికి హెల్ప్ అవుతుంది. వీటితో పాటు వర్కౌట్ చేయకపోవడం వల్ల సమస్య చాలా వరకూ పెరుగుతుంది.

**ఎక్కువగా మాంసం తినడం**

ప్రోటీన్ మన డైట్‌లో ఓ ముఖ్య భాగం. ఇది కండరాలను నిర్మించడానికి, నయం చేయడానికి, ఇన్ఫెక్షన్స్‌తో పోరాడేందుకు, ఆరోగ్యంగా ఉండడానికి హెల్ప్ చేస్తుంది. మనకి అవసరమైన ప్రోటీన్ మొత్తం మన వయసు, లింగం, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. మీట్, మిల్క్ ప్రొడక్ట్స్, గుడ్ల వంటి జంతు ప్రోటీన్లలో అన్ని అవసరమైన బిల్డింగ్ బ్లాక్‌లో ఉంటాయి. కానీ, కొన్ని అన్‌హెల్దీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. చేపలు, పౌల్ట్రీ, లో ఫ్యాట్ మిల్క్ ప్రొడక్ట్స్‌లో కొవ్వులు తక్కువగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మంచివి. అయితే, కిడ్నీ ప్రాబ్లమ్ ఉంటే, మీ శరీరం అన్ని ప్రోటీన్ వ్యర్థాలను తగ్గించడానికి కష్టపడొచ్చు.

**ఎక్కువగా షుగర్ తీసుకోవడం**


షుగర్ కారణంగా అధిక బరువు, హైబీపి, షుగర్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఇవి కిడ్నీల సమస్యలకి ప్రధాన కారణాలు. డెజర్ట్స్, డ్రింక్స్ వంటి వాటిలో షుగర్ ఉంటుంది. అందుకోసం ప్యాకేజ్డ్ ఫుడ్స్ తీసుకున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. వీటితో పాటు ఎక్కువగా ఆల్కహాల్ తీసుకోవడం వంటివల్ల సమస్య పెరుగుతుంది. స్మోకింగ్ కారణంగా కూడా సమస్య ఉంటుంది.

## నాలుక రంగు మారుతోందా, కొన్ని జబ్బులకు అది సంకేతం కావచ్చు

హెల్త్ న్యూస్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ): ఏ అనారోగ్యం వచ్చే ముందైనా కొన్ని సింప్టమ్స్ కనిపిస్తాయి. వాటిని బట్టి ఎలాంటి ఇబ్బంది ఉందని గుర్తించవచ్చు. అయితే..ఈ లక్షణాలు అనీ బయటకు కనిపించాలని లేదు. కొన్నిసార్లు ఇవి తెలియకుండానే ఇబ్బంది పెట్టేస్తాయి. కళ్లను బట్టి ఎలాంటి జబ్బు ఉందో తెలుసుకోవచ్చు అంటారు వైద్యులు. అందుకే..చెకప్ కి వెళ్లినప్పుడు కళ్లను పరీక్షిస్తారు. కేవలం కళ్లే కాదు. నాలుక కూడా అనారోగ్యాలకు సంబంధించిన సంకేతాలను ఇస్తుందని చెబుతున్నారు వెల్ నెస్ ఎక్స్ పర్ట్ మనీషా. ఏ మాత్రం పట్టించుకోకుండా వదిలేసే ఈ లక్షణాలను సరైన విధంగా గుర్తిస్తే చాలా వరకూ సమస్యల్ని తగ్గించుకోవచ్చని వివరించారు. ఆయుర్వేదం ప్రకారం నాలుక రంగుని బట్టి ఈ రోగాలను గుర్తించేందుకు వీలుంటుందని అన్నారు. మరి ఏ రంగుని బట్టి ఏ వ్యాధిని గుర్తించవచ్చు. అలాంటి లక్షణాలు కనిపించినప్పుడు ఏం చేయాలి అనేది తెలుసుకుందాం.

**రంగుని బట్టి**

మీ నాలుక రంగుని ఎప్పుడైనా గమనించారా. ఇదేం ప్రశ్న అనుకోకండి. కలర్ ని బట్టి మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయన్నది తెలుసుకోవచ్చు. కొన్ని అనారోగ్య సమస్యల్ని కేవలం ఈ రంగు ద్వారా గుర్తించవచ్చు. ఇదే విషయాన్ని చెబుతున్నారు వెల్ నెస్ ఎక్స్ పర్ట్ మనీషా. నిజానికి నాలుక రంగు ఎలా ఉందన్నది ఎవరూ ఎప్పుడూ పెద్దగా గమనించారు. బ్రష్ చేసుకున్నప్పుడు సింపుల్ గా క్లీన్ చేసుకుని అక్కడితో వదిలేస్తారు. కానీ..రంగు ఎలా ఉంది. నాలుకపై ఏమైనా మార్పులు వస్తున్నాయా అన్నది గమనించరు. ఇలా నిర్లక్ష్యం చేయడం వల్లే చిన్న సమస్యలు కాస్తా పెద్దవైపోతున్నాయి. తరవాత ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అలా కాకుండా ముందుగానే గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సమస్యలూ రావు. మరి నాలుక రంగుని బట్టి వ్యాధిని ఎలా గుర్తించాలి. వెల్ నెస్ ఎక్స్ పర్ట్ ఏం చెప్పారు.



**తెలుపులో ఉంటే**

నాలుకపై తెలుపు రంగు ఎక్కువైపోతూ ఉంటే వెంటనే జాగ్రత్తపడడం మంచిది. ఆయుర్వేదం ప్రకారం చెప్పాలంటే నాలుక ఇలా వైట్ కలర్ లోకి మారిపోయిందంటే కఫదోషం పెరిగిపోయిందని అర్థం. ఇలా కఫం పెరిగినప్పుడు శరీరంలో చాలా మార్పులు వస్తాయి. ముఖ్యంగా విపరీతమైన బద్ధకం వచ్చేస్తుంది. ఏ పనీ చేయాలని అనిపించదు. ఒకవేళ చేసినా ఫోకస్ ఉండదు. ఎప్పుడూ నిద్రమబ్బుగా ఉంటారు. అన్ని పనులనూ వాయిదా వేయాలనిపిస్తుంది. సింపుల్ గా చెప్పాలంటే ఇది పూర్తిగా మానసిక ఆరోగ్యాన్నీ దెబ్బ తీస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపించాయంటే కఫ దోషాన్ని పోగొట్టుకోడానికి ప్రయత్నించాలి. ఇందుకు సంబంధించిన ఆయుర్వేద చిట్కాలు పాటించాలి.

**నలుపు లేదా గోధుమ రంగు**

నాలుక రంగు పూర్తిగా నలుపు లేదా గోధుమ రంగులోకి మారిపోయిందంటే వాతదోషం ఉందని అర్థం. విపరీతంగా ఒత్తిడి ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది. స్ట్రెస్ కి లోనైనప్పుడు సరైన నిద్ర ఉండదు. ఎప్పుడూ చాలా అలసటగా అనిపిస్తుంది. ప్రతి చిన్న విషయాన్ని ఎక్కువగా ఆలోచిస్తుంటారు. ఆలోచనలకు కంట్రోల్ ఉండదు. అతిగా ఆలోచించడం, విశ్రాంతి లేకపోవడం..ఈ కారణాల వల్ల నాలుకపై రంగు మారిపోతుంది. వాతదోషం వస్తే చర్మంతో పాటు జుట్టు కూడా పొడిబారిపోతుంది. అంతే కాదు. ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. ఇది క్రమంగా మలబద్ధకానికి దారి తీస్తుంది. అక్కడితోనే సమస్యలన్నీ మొదలవుతాయి.

**ఆకుపచ్చ, ఎరుపు**

నాలుకపై రంగు ఆకుపచ్చ లేదా ఎరుపు రంగులకి మారిందంటే అది కూడా కొన్ని అనారోగ్యాలకు సంకేతమే. ఈ కలర్ ఉందంటే పిత్త దోషం ఉందని అర్థం చేసుకోవాలి. బాడీలో ఉండాల్సిన దాని కన్నా ఎక్కువ పిత్తగుణం ఉంటే ఇలా జరుగుతుంది. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థతో ముడిపడి ఉంటుంది. ఏం తిన్నా సరే విపరీతమైన అసిడిటీ వచ్చేస్తుంది. రిఫ్లెక్స్ తో ఇబ్బంది పడతారు. శరీరంలో క్రమంగా ఇన్ ఫ్లమేషన్ పెరిగిపోయి టాక్సిన్స్ పేరుకుపోతాయి. అంతే కాదు. మూడ్ స్వింగ్స్ కూడా ఎక్కువగా ఉంటాయి. ప్రతి దానికీ చిరాకు, కోపం వచ్చేస్తుంటుంది. పని తప్ప మరో ధ్యాస ఉండదు. ఎవరు కాస్త వర్క్ డిస్టర్బ్ చేసినా వెంటనే గట్టిగా అరిచేస్తారు. పసుపు రంగు ఉన్నా ఇదే సమస్య ఉన్నట్టు గమనించాలి.

**పింక్ కలర్ ఉంటే**

నాలుక గులాబీ రంగులో ఉంటే మాత్రం మీరు చాలా ఆరోగ్యంగా ఉన్నట్టు లెక్క. ఆయుర్వేదం ప్రకారం..నాలుక అంటే కేవలం మాట్లాడడానికి, రుచి చూడడానికి మాత్రమే ఉపయోగపడే అవయవం కాదు. ఆరోగ్యానికి ఇదే ఇండెక్స్ లాంటిది. అందుకే..నాలుకను శుభ్రంగా ఉంచుకోవాలి. రంగు మారినప్పుడు జాగ్రత్తపడాలి. కఫం, వాతం పెంచే ఆహార పదార్థాలను పూర్తిగా పక్కన పెట్టాలి. శరీరంలో ఇన్ ఫ్లమేషన్ తగ్గించే ఫుడ్ తీసుకోవడం మంచిది. వీలైనంత వరకూ ఆయిల్ ఫుడ్ తగ్గించాలి.

# బడిసె వీరుడి విజయగర్జన..
# పారిస్ డైమండ్ లీగ్ టైటిల్ కైవసం

స్పోర్ట్స్ న్యూస్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ): భారత ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా మళ్లీ మెరిశాడు. దోహా డైమండ్ లీగ్‌లో నిరాశపరిచిన బడిసె వీరుడు పారిస్ డైమండ్ లీగ్ లో అదరగొట్టాడు. జూలియన్ వెబర్(జర్మనీ)ను రెండోస్థానానికి పరిమితం చేస్తూ టైటిల్ గెలుపొందాడు. జూనియర్ ఈ రెండేళ్లలో అతడు డైమండ్ లీగ్‌లో ఛాంపియన్‌గా నిలవడం ఇదే మొదటిసారి. 2017లో జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌గా ఈ పోటీల్లో పాల్గొన్న చోప్రా.. ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇప్పుడు మాత్రం ఏకంగా టైటిల్ విజేతగా అవతరించి రికార్డులు బద్ధలు కొట్టాడీ భారత స్టార్.



ఈమధ్యే దోహాలో జరిగిన డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల మార్క్ అందుకున్న చోప్రా.. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్లో సత్తా చాటాడు. తొలి రౌండ్‌లో ఈటెను 88.16 మీటర్ల దూరం విసిరాడు. రెండో రౌండ్‌లో 85.10 మీటర్లకే పరిమితమైన నీరజ్ తర్వాత మూడు ప్రయత్నాలు ఫౌల్ అయ్యాయి. అయినా సరే ఒత్తిడికి లోనవ్వకుండా ఆఖరిదైన ఆరో రౌండ్‌లో భారత స్టార్ బడిసెను 82.89 మీటర్ల దూరం విసిరి విజేతగా అవతరించాడు. డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల దూరంతో చోప్రాకు షాకిచ్చిన వెబర్ ఈసారి మాత్రం తేలిపోయాడు.

తొలి రౌండ్‌లో 87.88 మీటర్ల మార్క్ అందుకున్న అతడు తదుపరి ప్రయత్నాల్లో స్థాయికి తగ్గట్టు రాణించలేదు. వెబర్ రెండో స్థానానికి పరిమితం కాగా.. లూయిజ్ మౌరిసియో డిసిల్వా(బ్రెజిల్) మూడో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న చోప్రా జూన్ 24న ఒస్ట్రావా(చెక్ రిపబ్లిక్)లో జరుగనున్న గోల్డెన్ స్పైక్స్ అథ్లెటిక్స్‌లో పోటీ పడనున్నాడు. అనంతరం జూలై 5న తన పేరుతో తొలిసారి నిర్వహిస్తున్న నీరజ్ చోప్రా క్లాసిక్ ఎడిషన్‌లో బల్లెం యోధుడు పాల్గొంటాడు.

# హారికకు మూడో స్థానం



స్పోర్ట్స్ న్యూస్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక మూడో స్థానాన్ని దక్కించుకుంది. మరోవైపు భారత నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టార్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి వరుసగా మూడో ఓటమి చవిచూసి ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. అలీనా కషిన్‌స్కాయ (పోలాండ్)తో జరిగిన చివరిదైన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను హారిక 38 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించి 5 పాయింట్లతో మూడో స్థానాన్ని ఖరారు చేసుకుంది. గత ఏడాది కూడా మూడో స్థానంలో నిలిచిన హారిక ఈ ఏడాది టోర్నీలో కేవలం కోనేరు హంపి చేతిలో ఓడిపోయి... మిగతా ఎనిమిది గేముల్లో రెండింటిలో గెలిచి, ఆరింటిని 'డ్రా' చేసుకుంది.

ఆరో రౌండ్ తర్వాత అగ్రస్థానంలో నిలిచిన హంపి వరుసగా మూడు గేముల్లో ఓడిపోయి 4.5 పాయింట్లతో ఐదో స్థానాన్ని పొందింది. ఏడో రౌండ్‌లో కరిసా యిప్ (అమెరికా) చేతిలో, ఎనిమిదో రౌండ్‌లో నినో బత్సియాష్‌విలి (జార్జియా) చేతిలో ఓడిన హంపి 46 ఎత్తుల్లో మరియా ముజీచుక్ (ఉక్రెయిన్) చేతిలో పరాజయం పాలైంది. హంపితోపాటు నానా జాగ్‌నిడ్జె (జార్జియా), బీబీసారా అసబయేవా (కజకిస్తాన్), అలీషా 4.5 పాయింట్లతో ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచారు.

మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... నానా జాగ్‌నిడ్జె నాలుగో స్థానంలో, హంపి ఐదో స్థానంలో, బీబీసారా ఆరో స్థానంలో, అలీషా ఏడో స్థానంలో నిలిచారు. పది మంది మేటి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహించగా... 6 పాయింట్లతో కరిసా యిప్ (అమెరికా) చాంపియన్‌గా అవతరించింది. 5.5 పాయింట్లతో అలైస్ లీ (అమెరికా) రన్నరప్‌గా నిలిచింది. విజేత కరిసా యిప్‌నకు 60 వేల డాలర్లు (రూ. 51 లక్షల 96 వేలు), రన్నరప్ అలైస్ లీకి 50 వేల డాలర్లు (రూ. 43 లక్షల 30 వేలు), మూడో స్థానంలో నిలిచిన హారికకు 40 వేల డాలర్లు (రూ. 34 లక్షల 64 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

## బుర్ర వాడేవాళ్లు ఇలాంటి పనిచేయరు:
# స్టోక్స్‌పై మాజీ కెప్టెన్ ఫైర్



స్పోర్ట్స్ న్యూస్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):టీమిండియాతో తొలి టెస్టులో తొలి రోజు ఇంగ్లండ్‌కు భంగపాటే ఎదురైంది. లీడ్స్ వేదికగా టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ బౌలింగ్‌ను భారత బ్యాటర్లు చితక్కొట్టారు. ఓపెనర్లలో కేఎల్ రాహుల్ రాణించగా.. యశస్వి జైస్వాల్ శతకం (101)తో చెలరేగాడు. ఇక ఈ సిరీస్‌తో భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా ప్రయాణం మొదలుపెట్టిన శుబ్‌మన్ గిల్ కూడా సెంచరీతో కదం తొక్కాడు.

అదే విధంగా.. వైస్ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ కూడా అర్ధ శతకంతో మెరిశాడు. వెరసి శుక్రవారం నాటి తొలిరోజు ఆట పూర్తయ్యేసరికి 85 ఓవర్లు ఆడిన టీమిండియా మూడు వికెట్లు నష్టపోయి 359 పరుగులు సాధించింది. తద్వారా ఆతిథ్య జట్టుపై పర్యాటక టీమ్ మొదటి రోజు పూర్తి ఆధిపత్యం కనబరిచింది.

కామన్ సెన్స్ ఉన్నవాళ్లు ఇలా చేయరు

ఈ నేపథ్యంలో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ నిర్ణయంపై విమర్శలు వస్తున్నాయి. ఇంగ్లండ్ మాజీ సారథి మైకేల్ అథర్టన్ కూడా ఈ విషయంలో స్టోక్స్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశాడు.

"టాస్ గెలిచిన కెప్టెన్ తీసుకున్న నిర్ణయం ఆసక్తికరంగా అనిపించింది. గత ఆరు మ్యాచ్‌లలో తొలుత బౌలింగ్ చేసిన జట్టే విజయం సాధించిందని గణాంకాలు చెబుతున్నాయి. అయితే, కాస్త కామన్ సెన్స్ ఉన్నవాళ్లు.. క్రికెట్ బుర్ర వాడేవారు ఎవరైనా ఇక్కడ టాస్ గెలిస్తే బ్యాటింగ్ తీసుకుంటారు.

ఎందుకంటే.. ఇక్కడ ఇప్పుడు తీవ్రమైన ఎండ ఉంది. రానున్న రెండు రోజుల్లో 30 డిగ్రీలకు పైగానే ఉంటుంది. స్టోక్స్ కేవలం గత రికార్డు ఆధారంగానే తొలుత బౌలింగ్ ఎంచుకుని ఉంటాడు" అని అథర్టన్ స్టోక్స్ నిర్ణయాన్ని తప్పుబట్టాడు. అయితే, భారీ లక్ష్యాన్ని కూడా ఛేదించగల సత్తా ఇంగ్లండ్‌కు ఉందని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశాడు.

ఇంగ్లండ్ పశ్చాత్తాపం!

కాగా ఇంగ్లండ్ మరో మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ కూడా టాస్ విషయంలో ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇక తీవ్రమైన ఎండ, పొడిగా ఉన్న పిచ్, స్వింగ్‌కు ఏమాత్రం అవకాశం లేని వాతావరణం, పెద్దగా అనుభవం లేని బౌలర్లు... ఇలాంటి స్థితిలో టాస్ గెలిచి స్టోక్స్ బౌలింగ్ ఎంచుకునే సాహసం చేయడంతో ఇంగ్లండ్ పశ్చాత్తాపపడాల్సిన పరిస్థితి తలెత్తింది.

నిజమే... హెడింగ్లీ మైదానంలో గత ఆరు టెస్టుల్లో ముందుగా బౌలింగ్ చేసిన జట్టే గెలిచింది. కానీ శుక్రవారం పరిస్థితి వాటికి భిన్నం. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడటం చూస్తే తాము చేసిన తప్పేమిటో ఇంగ్లండ్‌కు అర్థమై ఉంటుంది. కాగా టెండుల్కర్-ఆండర్సన్ ట్రోఫీలో భాగంగా టీమిండియా ఐదు టెస్టులు ఆడేందుకు ఇంగ్లండ్‌కు వెళ్లింది.

# యోగాసనాలతో చిన్నారి వరల్డ్ రికార్డు..



స్పోర్ట్స్ న్యూస్ ,21 జూన్ ( క్రాంతి న్యూస్ ):అంతర్జాతీయ యోగా దినోత్సవం వేళ కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ చిన్నారి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ స్థానం సంపాదించింది. హసన్ జిల్లాకు చెందిన 12 ఏళ్ల చిన్నారి రిత్వీ చిన్న వయసులోనే యోగా ప్రాక్టీస్ మొదలు పెట్టింది. ఆమె శరీరంలో ఎముకలు లేవా? అన్నట్లుగా కళ్లు చెదిరే ఆసనాలతో చూపరులను ఆశ్చర్యపరుస్తోంది. తొమ్మిదో తరగతి చదువుతున్న రిత్వీ.. రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో అనేక అవార్డులు గెలుచుకుంది. తాజాగా అంతర్జాతీయ యోగా పోటీలో పాల్గొని బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డును కైవసం చేసుకుంది. కఠినమైన బాక్స్ యోగా ఆసనం ద్వారా అద్భుతమైన యోగా స్కిల్స్ ప్రదర్శించి వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. ఆమె ఒక చిన్న పెట్టెలో ఉండి అందులోనే యోగాసనాలను ప్రదర్శించింది. చిన్నారి రిత్వీ మీడియాతో మాట్లాడుతూ.. "నేను యోగా చేసినప్పుడు, నాకు రిలాక్స్‌గా అనిపిస్తుంది. చదువుపై నాకు ఎక్కువ ఏకాగ్రత వస్తుంది. నేను ఒక నిమిషంలో పది ఆసనాలు వేశాను, అది నాకు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. నేను అంతర్జాతీయ యోగా ఛాంపియన్‌గా ఉండాలనుకుంటున్నాను" అని తెలిపింది. తనకు 4 ఏళ్ల వయసు ఉన్నప్పుడు యోగాభ్యాసం ప్రారంభించినట్లు చిన్నారి రిత్వీ తెలిపింది. ప్రతి రోజూ ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు యోగా చేస్తానని చెప్పింది. అలాగే ఇటీవల యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2025లో పాల్గొని రిత్వీ రజత పతకాన్ని గెలుచుకుంది.



# సినిమా న్యూస్





## షూటింగ్‌లో నవ్వులు.. కారవాన్లో కన్నీళ్లు



తెలుగు చిత్రసీమలో తనదైన గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల. చిన్న చిత్రాలతో సినీ ప్రయాణం ప్రారంభించిన ఈ ముద్దుగుమ్మ 2018లో విడుదలైన 'మల్లేశం' మూవీతో ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. ఆ తర్వాత పవన్ కల్యాణ్ 'వకీల్‌సాబ్'లో తన పాత్రతో మంచి గుర్తింపు లభించగా. తర్వాత 'శాకుంతలం', 'తంత్ర','పొట్టేల్' వంటి విభిన్న కథాచిత్రాల్లో నటించి తన టాలెంట్‌తో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకుంది. ఇక యాక్టింగ్ తో పాటు, వ్యక్తిత్వం విషయంలోనూ ఎంతో బలంగా నిలిచిన అనన్య.. ఇటీవల తన జీవితానికి సంబంధించిన ఒక విషాద ఘట్టాన్ని ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. 'చాలా మంది జీవితాలు వెలుగులో ఉంటాయి. కానీ, వారి బాధలు వెనుక దాగుంటాయి. ఇండస్ట్రీకి వచ్చాక కొంతకాలానికే నా బ్రేకప్ జరిగింది. అది నా మనసుకు తాకిన పెద్ద షాక్. రెండు సంవత్సరాలు ఆ బాధ నుంచి బయట పడలేక పోయా. రాత్రిపూట ఎమోషన్‌తో ఏడ్చేసి, ఉదయం జిమ్‌కి వెళ్ళేదాని. కారవాన్లో ఏడ్చిన కూడా, తర్వాత షూటింగ్‌కు వచ్చేసే సమయానికి బాధ కనిపించకుండా చూసుకునేదాని. కుటుంబానికి ఏ మాత్రం తెలియనివ్వలేదు. ఎలాంటి పరిస్థితినైనా గట్టిగా ఎదుర్కొనగల శక్తి నాకు ఉంది. బ్రేకప్ బాధ నా కెరీర్‌పై ప్రభావం చూపకుండా చూసుకున్నాను. ప్రెఫెషనల్ లైఫ్‌లో ఎమోషన్స్‌కు స్థానం ఇవ్వకూడదని అప్పుడే నిర్ణయింయుకున్న. నటిగా నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన వాళ్లను నిరాశపరచకూడదు. అందుకే ఆ బాధను బయట చూపించలేదు' అని అనన్య తెలిపింది. ఆమె చెప్పిన ఈ మాటలు ఎంతో మందికి ప్రేరణ గా నిలుస్తున్నాయి.

## హరిహర వీరమల్లు రిలీజ్ డేట్ ఫిక్స్..





పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ప్రతిష్టాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు'. కృష్ణం రాజ్ దర్శకత్వం వహించగా, ప్రముఖ నిర్మాత ఏ.ఎం. రత్నం ఈ భారీ ప్రాజెక్టు నిర్మించారు. మొదటి నుండి పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్న ఈ చిత్రం ఎట్టకేలకు విడుదల తేదీ ఖరారైంది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా జూలై 24, 2025న గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ అధికారికంగా ఈ అప్డేట్ ప్రకటించడంతో, పవన్ ఫ్యాన్స్‌లో దిల్ కుష్ అవుతున్నారు. ఈ చిత్రంలో పవన్‌కు జోడీగా నిధి అగర్వాల్ నటిస్తుండగా, ప్రముఖ నటులు అర్జున్ రాంపాల్ (ఔరంగజేబ్‌గా), నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించిన ఈ చిత్రం పాటలు ఇప్పటికే అంచనాలను పెంచేశాయి. ఇప్పటికే పోస్టర్స్, మేకింగ్ వీడియోలతో, ఫ్యాన్స్‌లో భారీ హైప్ క్రియేట్ చేసిన "హరి హర వీరమల్లు" ఇప్పుడు విడుదలకు రెడీ అయింది. పవన్ మరోసారి తన పవర్‌ను చూపించనున్నారు. అంతే కాదు త్వరలో మేకర్స్ ఓ పవర్‌ఫుల్ ట్రైలర్‌ను రిలీజ్ చేయనున్నారు. అలాగే ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా గ్రాండ్ లెవల్లో ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ రాజకీయంగా బిజీగా ఉన్నా, సినిమాతోను తన అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చే ప్రయత్నం మాత్రం గట్టిగానే చేస్తున్నారు.

## 'సతీ లీలావతి' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్..!



టాలీవుడ్ హీరోయిన్ లావణ్య త్రిపాఠి నటిస్తున్న తాజా చిత్రం 'సతీ లీలావతి'. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి.. భీమిలి కబడ్డీ జట్టు, శివ మనసులో శృతి వంటి విభిన్న చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వం వహించనున్నాడు. లావణ్య త్రిపాఠి పుట్టినరోజు సందర్భంగా (డిసెంబర్ 15, ఆదివారం) ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం, తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేశారు.మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్‌గా బినేంద్ర మీనన్, ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య చేపడుతున్నారు. కథ కనుక చూసుకుంటే భర్త-భార్యల మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ సినిమా సున్నితంగా చూపించనుంది. ఎమోషన్‌తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్‌కి కూడా పూర్తి స్థానం ఉండబోతుంది. ఫీల్ గుడ్ ఫ్యామిలీ డ్రామా గా రూపొందిన ఈ చిత్రం, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. మొత్తానికి 'సతీ లీలావతి' ద్వారా లావణ్య మరోసారి ఒక డిఫరెంట్ పాత్రతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.

## నా శరీరం.. నా ఇష్టం



తనకి సంబంధించిన ఏ విషయాన్నైనా ఉన్నది ఉన్నట్లుగా చెప్పేందుకు ఇష్టపడుతుంటుంది నటి శ్రుతిహాసన్. తన ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్న విషయాన్ని ఎన్నో ఇంటర్వ్యూల్లో స్వయంగా పంచుకున్న ఆమె ఇదే అంశంపై మరోసారి తనదైన శైలిలో స్పందించింది. "టీనేజ్‌లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చేది కాదు. అందుకే సర్జరీ చేయించుకున్నా. అలాగే ముఖం మరింత అందంగా కనిపించేందుకు ఫిల్లర్స్ కూడా వాడా. దీంట్లో దాచుకునేది ఏమీ లేదు. నేను ఎన్నో సందర్భాల్లో ఈ విషయాల్ని చెప్పా. కొందరు వీటిని బయటకు చెప్పడం ఎందుకని దాచుకుంటారు. నేను వాళ్ల అభిప్రాయాల్ని గౌరవిస్తాను. కానీ, నాలా ధైర్యంగా చెప్పుకునే వాళ్లనూ తప్పు పట్టాల్సిన అవసరం లేదు. ఏమో భవిష్యత్తులో వయసు పైబడ్డాక ఫేస్ లిఫ్ట్ కూడా చేయించుకుంటానేమో. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. నా శరీరం నా ఇష్టం. ఇతరులకు ఇబ్బంది లేనప్పుడు దాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఏముంది" అని శ్రుతి తన అభిప్రాయాన్ని పంచుకుంది. ప్రస్తుతం ఆమె రజనీకాంత్‌తో 'కూలీ'లో నటిస్తోంది. ఇది ఆగస్టు 14న థియేటర్లలోకి రానుంది.

## ఈ ప్రశంసలన్నీ శేఖర్ కమ్ముల వల్లే..



తాజాగా విడుదలైన 'కుబేర' చిత్రం ఎలాంటి హిట్ అందుకుందో తెలిసిందే. చాన్నాళ్ల తర్వాత మళ్లీ థియేటర్ల ముందు హౌస్ ఫుల్ బోర్డులు కనిపించాయి.అంచనాలను మించి ఫుల్ పాజిటివ్ టాక్ వచ్చింది. రివ్యూలు అదిరిపోయాయి. ధనుష్ యాక్టింగ్ కి వందకు వంద మార్కులు పడినప్పటికి.. నాగార్జున పాత్ర ప్రస్తుతం టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అయిపోయింది. ఇక సమీరా పాత్రను పోషించిన రష్మిక మందన్నా అయితే ఆ పాత్రలో ఒదిగిపోయి నటించింది. దీంతో రష్మిక యాక్టింగ్ కు తెలుగు ప్రేక్షకులు మరో సారి ఫిదా అయ్యారు.అయితే తాజాగా ఆమె పై వస్తున్న ఈ ప్రశంసల నేపథ్యంలో తన అనుభూతులను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది రష్మిక. ఈ పాత్రలో ఒదిగిపోయే అవకాశం కల్పించిన దర్శకుడు శేఖర్ కమ్ములకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు..'శేఖర్ కమ్ముల సార్ దర్శకత్వంలో నటించాలనేది నా కోరిక. ఆ కోరిక 'కుబేర' తో నెరవేరింది. సమీరా పాత్రలో నా నటనకు వస్తున్న ఆదరణ చాలా ఆనందంగా ఉంది. ఈ పాత్రకు శేఖర్ సార్ వల్లే నేను జీవం పోయగలిగాను. ప్రతి సన్నివేశం లో నాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అలాగే ధనుష్ లాంటి నటుడు పక్కన ఉన్నప్పుడు ప్రతీసీన్‌లో శ్రద్ధ పెట్టాల్సిందే. నాగార్జున సర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శం. ఆయన నుంచి నేనెన్నో నేర్చుకున్నాను 'కుబేర' సినిమా అందరు తప్పక చూడాల్సిన చిత్రం. సమీరా పాత్ర, కథ, మొత్తం ఒక అందమైన గందరగోళం లాంటిది. మీరు చూసిన తర్వాత నా మాట అర్థమవుతుంది' అంటూ టీమ్‌కి మరో సారి కృతజ్ఞతలు తెలిపారు రష్మిక. ప్రజంట్ ఈ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com